సాక్షి
ఖమ్మం
గురువారం ◊ 4 ◊ సెప్టెంబర్ ◊ 2025



ఇండస్ట్రియల్ పార్క్ లేనట్టే..

ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లలో భూమి కేటాయించినా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుపై సందిగ్ధత నెలకొంది. IIలో



బస్సులన్నీ దామరచర్లకే..

చంద్రుగొండ మండలం దామచర్లలో జరిగిన సీఎం సభకు బస్సులు కేటాయించడంతో మిగతా ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. IIలో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. మధ్యాహ్నం సమయాన ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

13న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ తెలిపారు. న్యాయవాదులు, చిట్‌ఫండ్, బ్యాంక్, బీమా కంపెనీల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, వివాహ, కుటుంబ తగాదా తదితర కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. బీమా, బ్యాంక్, చిట్‌ఫండ్ అధికారులు పెండింగ్ కేసుల పరిష్కారానికి ముందుకు రావాలని సూచించారు. అత్యధిక కేసుల పరిష్కారమే లక్ష్యంగా ముందస్తు లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి తెలిపారు.

ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మంవ్యవసాయం: పండుగలు, వారాంతం కలిపి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజుల సెలవు ప్రకటించారు. ఈనెల 5న శుక్రవారం మిలాద్ ఉన్ నబీ, 6న శనివారం, 7న ఆదివారం వారాంతపు సెలవులు వచ్చాయి. దీంతో సోమవారం నుంచి మార్కెట్ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతాయని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.


విద్యుత్ ఫిర్యాదులకు వాట్సాప్ చాట్‌బాట్

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, సేవల కోసం వాట్సాప్ చాట్‌బాట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. వినియోగదారులు తమ వాట్సాప్‌లో 79016 28348 నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ చేస్తే ఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్ నుంచి సందేశం వస్తుందని వెల్లడించారు. ఆపై విద్యుత్ సమస్యలు, సేవా లోపాలపై ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. అంతేకాక ఎన్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్ www.tgnpdcl.comలో కూడా అందుబాటులో ఉన్న వాట్సాప్ యాప్ ఐకాన్‌తో పాటు టోల్‌ఫ్రీ నంబర్ 1912 ద్వారా కూడా ఫిర్యాదు చేసే అవకాశముందని ఎస్‌ఈ వెల్లడించారు.

7వరకు దరఖాస్తుకు అవకాశం

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు అపరాధ రుసుము లేకుండా ఈనెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అదనపు కలెక్టర్ శ్రీజ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కూరపాటి మంగపతిరావు తెలిపారు. అలాగే, అపరాధ రుసుంతో 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. వివరాలకు 80084 03522 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చేపల ఉత్పత్తిలో రాణించాలి



మాట్లాడుతున్న రవీంద్రకుమార్‌రెడ్డి

కూసుమంచి: మత్స్యకారులు శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ చేపల ఉత్పత్తిలో రాణించాలని ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం డీన్ డి.రవీంద్రకుమార్‌రెడ్డి సూచించారు. పాలేరులోని పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నల్లగొండ, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల మత్స్యకారులకు ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో డీన్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. తక్కువ ధరలో పౌష్టికాహారాన్ని అందించే చేపలకు ఎప్పటికీ డిమాండ్ ఉంటుందని తెలిపారు. ఫిషరీస్ సీనియర్ సైంటిస్ట్(ఏపీ) ప్రభంజన్ కుమార్‌రెడ్డి, పాలేరు హెడ్ శ్యాంప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, శాంతన్న పాల్గొన్నారు.

ఐజీని కలిసిన సీపీ

ఖమ్మంక్రైం: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించడానికి చంద్రుగొండకు వెళ్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఖమ్మంలోని పోలీస్ గెస్ట్‌హౌస్‌లో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనను సీపీ సునీల్‌దత్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీతోపాటు ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈమేరకు పోలీసు సిబ్బంది ఐజీ చంద్రశేఖర్‌రెడ్డికి గౌరవ వందనం సమర్పించారు.

పది రోజుల్లో ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యేల నుంచి విజ్ఞాపనలు అందాయి..
- త్వరలోనే వారితో మంత్రుల భేటీ
- ఆపై ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం
- దామరచర్ల సభలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి





అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, శ్రీహరి, ఎంపీ బలరాం, ఎమ్మెల్యేలు ఆదినారాయణ, పాయం, రాగమయి, కనకయ్య, ఐడీసీ చైర్మన్ విజయ్‌బాబు తదితరులు (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన తనకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పలు సమస్యలపై విజ్ఞాపన పత్రాలు అందజేశారని, వీటన్నింటిపై పది రోజుల్లో ప్రభుత్వ పరంగా దృష్టి సారిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. చంద్రుగొండ మండలం బెండాలపాడులో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం అనంతరం దామరచర్లలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, వైరా, సత్తుపల్లి, పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల సమస్యలు, పనులపై వినతిపత్రాలు ఇచ్చారు. పది రోజుల్లో వారితో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెప్పా. వినతిపత్రాలు, ప్రతిపాదనలపై జిల్లా అధికారులతో చర్చించి అన్ని సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల వద్దే కీలక శాఖలు ఉన్నాయి.



దామరచర్ల సభకు హాజరైన జనం

సారపాకలో సన్న బియ్యం భోజనం..

గతంలో రేషన్‌కార్డులపై పేదలకు దొడ్డుబియ్యం పంపిణీ చేసేవారు. ఆ బియ్యంతో అన్నం తినలేక చాలా మంది అమ్ముకునే వారు. కానీ మా ప్రభుత్వం వచ్చాక పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించాం. సారపాకలో సామాన్యుడి ఇంట్లో భోజనం చేయడానికి వెళ్లినప్పుడు రేషన్ కార్డుపై వచ్చిన బియ్యంతోనే అన్నం వండమని చెప్పాం. ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దుకుంటామని చెప్పా. కానీ ఆ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు జూబ్లీహిల్స్‌లోని మా ఇంట్లో, శీనన్న(పొంగులేటి శ్రీనివాసరెడ్డి) ఇంట్లో అన్నం తిన్నట్టే అనిపించింది. సన్నబియ్యంతో అన్నం తింటున్నప్పుడు సామాన్యుడి కళ్లలో కనిపించే ఆనందం కోటి రూపాయలు ఇచ్చినా రాదు.

ఆత్మగౌరవంతో బతికేలా

తొలిదశ తెలంగాణ ఉద్యమం పాల్వంచలో ప్రారంభమై తెలంగాణకు దిశాదశ చూపించింది. ఏ సమస్య వచ్చినా ముందుగా స్పందించేది ఖమ్మం జిల్లానే. ఈ జిల్లా వాసులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తారు. ఇక్కడ గూడేలు, తండాల వారికి తల్లితో సమానంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై గౌరవం ఉంది. అందుకే పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం నిజం చేస్తోంది. పేదలు సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు గడిచిన పదేళ్లుగా ఎదురుచూసి నిరాశ చెందారు. ఇప్పుడు నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రంలో 4.50లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. అశ్వారావుపేటకు మాత్రం ఏకంగా 4,500 ఇళ్లు ఇచ్చాం. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే.

2–30 గంటల పాటు..

షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2:20 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి చంద్రుగొండకు రావాల్సి ఉంది. అయితే మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటన కారణంగా మధ్యాహ్నం 3 : 40 గంటలకు చంద్రుగొండకు చేరుకున్నారు. తొలుత బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్నాక పైలాన్ ఆవిష్కరించి ఇందిరమ్మ లబ్ధిదారులతో మాటామంతీ నిర్వహించారు. ఆ తర్వాత దామరచర్లలో బహిరంగ సభాస్థలికి చేరుకున్నారు. అక్కడ 29 నిమిషాల పాటు ప్రసంగించిన సీఎం.. సాయంత్రం 6 : 10 గంటలకు తిరుగు పయనమయ్యారు. మొత్తంగా రెండున్నర గంటల పాటు జిల్లాలో సీఎం పర్యటన కొనసాగింది.



బచ్చల రమణ ఇంటిని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రి పొంగులేటి



బచ్చల నర్సమ్మ ఇంటి గృహప్రవేశం అనంతరం పూజ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సంక్షేమానికి మారుపేరు వైఎస్సార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: దామరచర్లలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న సభలో వక్తలు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి నామస్మరణ చేశారు. ఆయన ముఖ్యమంత్రిగా అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తావించినప్పుడల్లా అభిమానులు, ప్రజలు కేరింతలు కొట్టారు. సీఎం తన ప్రసంగంలో వైఎస్ ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తుండగా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. వైఎస్ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా తమ ప్రసంగాల్లో వైఎస్సార్ పేరు ప్రస్తావించారు. ఆయన సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడే సమయాన ప్రజలు ఈలలు, చప్పట్లతో తమ హర్షాతిరేకాలు వెలిబుచ్చారు.

మూడోసారి ముడిపడింది!

- బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లను అంతా తానై పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ముచ్చటగా మూడోసారి ముడిపడింది. మండలంలోని బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్లను బుధవారం సీఎం ప్రారంభించారు. అనంతరం దామరచర్లలో నిర్వహించిన సభలో పాల్గొన్నారు. అధికారిక సభే అయినా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన విజయవంతం చేయడంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీ వెళ్లడంతో ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు.

రెండుసార్లు వాయిదాపడి..

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి పైలట్ ప్రాజెక్టుగా చంద్రుగొండ మండలం బెండాలపాడును ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇక్కడ నిర్మాణం పూర్తయిన ఇళ్ల గృహప్రవేశం గత నెల 21న ఉంటుందని ప్రకటించినా వర్షాలు, ఇతర కారణాలతో వాయిదా పడింది. ఆ తర్వాత అదేనెల 30న నిర్వహించాలని నిర్ణయించినా అప్పుడూ వాయిదా పడడంతో లబ్ధిదారులు, కాంగ్రెస్ నేతలు నిరాశ చెందారు. మూడోసారి బుధవారం ముహూర్తం కుదిరింది. తొలుత బెండాలపాడుకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. దీంతో లబ్ధిదారులు తాము ఇన్నాళ్లకు ఇంటి యజమానులుగా మారామని ఆనందం వ్యక్తం చేశారు. ఇక దామరచర్లలో నిర్వహించిన బహిరంగ సభకు సైతం వివిధ ప్రాంతాల ప్రజలు భారీగా హాజరయ్యారు.

ప్రతిష్టాత్మకంగా..

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పలుమార్లు పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. భద్రాద్రి జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలను తరలించగా విజయవంతం కావడంతో కాంగ్రెస్ నేతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

అంతా తానై...

బెండాలపాడులో గృహప్రవేశాలు, దామరచర్లలో బహిరంగ సభ ఏర్పాట్లలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అంతా తానై వ్యవహరించారు. మంత్రి పొంగులేటి మూడుసార్లు బెండాలపాడును సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడడంతో పాటు ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే, దామరచర్లలో సభ ఏర్పాట్లపైనా ప్రత్యేక దృష్టి సారించడంలో సాఫీగా ముగిసింది.

లక్ష్మీగణపతి!

రూ.51.60లక్షల కరెన్సీ మాలలతో అలంకరణ



గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా సత్తుపల్లిలోని శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలో వాసవీగణపతిని బుధవారం కరెన్సీ మాలలతో అలంకరించారు. రూ.51.06 లక్షల విలువైన రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లతో గజమాలలు, మాలలు, కిరీటం, తోరణాలు చేసి అలంకరించగా స్వామి లక్ష్మీగణపతిగా దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వందనపు సత్యనారాయణతో పాటు సోమిశెట్టి శ్రీధర్, గంగిశెట్టి జగదీష్, ఉండు ఉమ, శివనాథ్‌ప్రభు, పోలిశెట్టి శివకుమార్, మంజుల పాల్గొన్నారు. – సత్తుపల్లిటౌన్

రేపు జీపీఓలకు నియామకపత్రాలు



వీసీలో కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్వో పద్మశ్రీ

ఖమ్మం సహకారనగర్: సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 5న హైదరాబాద్‌లో గ్రామ పరిపాలన అధికారులు(జీపీఓ)లకు నియామకపత్రాలు అందించనున్నట్లు సీసీఎల్ఏ కార్యదర్శి లోకేష్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఆయన వీసీ ద్వారా సమీక్షించగా జిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్‌కుమార్ మాట్లాడుతూ జీపీఓ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను హైదరాబాద్ పంపించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. జిల్లా నుంచి 307మంది ఉండగా, ఆరు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీరికి సొంత మండలంలో కాకుండా కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. సమీక్షలో డీఆర్ఓ ఏ.పద్మశ్రీ, కలెక్టరేట్ ఏఓ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాజీపేట – విజయవాడ మూడో రైల్వేలైన్, ఇతర ప్రాజెక్టుల భూసేకరణపై కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ మనోజ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు.

యూరియా.. కరువాయే..

- పీఏసీఎస్‌ల ద్వారా అరకొరగానే పంపిణీ
- ఇండెంట్‌కు అనుగుణంగా సరఫరా లేక ఇక్కట్లు
- పైర్ల కీలకదశలో అన్నదాతల ఆవేదన



నాచేపల్లి పీఏసీఎస్ తెరవకముందే యూరియా కోసం వేచి ఉన్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: యూరియా కొరత అన్నదాతలను అష్టకష్టాలు పెడుతోంది. వానాకాలం పంటల సాగు అంచనాలు దాటగా.. పైర్లకు యూరియా అందించాల్సిన కీలకమైన సమయంలో లభ్యత లేక ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో ఈ వానాకాలంలో అన్ని పంటలు కలిపి 6,60,657 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో వరి 2,89,553 ఎకరాల్లో, పత్తి 2,25,613 ఎకరాల్లో సాగవుతోంది. ఈ పంటలకు అనుగుణంగా ఈనెల వరకు జిల్లాకు 54,826 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉంది. కానీ 20,012 మెట్రిక్ టన్నులు మాత్రమే రావడంతో అరకొరగా పంపిణీ చేస్తుండగా రైతులు పడిగాపులు కాస్తున్నారు.

వరికి అవసరం

వరికి ఈ సమయాన యూరియా అందించడం ప్రధానం. నాట్లు వేశాక 15 రోజుల వ్యవధి నుంచి దఫాల వారీగా అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వరి 30 – 40 రోజుల దశలో ఉండగా యూరియా కొరత ఏర్పడింది. ఈ దశలో సరిపడా అందించకపోతే దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ నత్రజనితో కూడిన ఎరువులు వినియోగించాలన్నా ధర ఎక్కువగా ఉండడంతో అటు మొగ్గు చూపడం లేదు. యూరియా బస్తా ధర రూ. 266 కాగా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల ధరలు రూ.1,500 వరకు ఉన్నాయి. జిల్లాకు గత వారం వచ్చిన 938 మెట్రిక్ టన్నుల యూరియాను పీఏసీఎస్‌ల ద్వారా సరఫరా చేస్తున్నా రైతుకు ఒక బస్తా కూడా అందడం లేదు. ఫలితంగా పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే బారులు తీరుతున్నారు. అయినా అందరికీ యూరియా అందక కూపన్లు జారీ చేస్తున్నా అధికారులు ఒకటి, రెండు రోజుల్లో సరఫరా చేస్తామని నచ్చచెప్పి పంపిస్తున్నారు.

యూరియా అందించలేకపోతున్నాం

పంటలకు యూరియా అందించలేకపోతున్నాం. అవసరమైన సమయంలో యూరియా లభించడం లేదు. ఈ ప్రభావం దిగుబడులపై పడుతుందనే ఆందోళన ఉంది. ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియానే ఇస్తే ఎలా సరిపోతుందో అధికారులే ఆలోచించాలి. – చామకూరి రమేష్, పిండిప్రోలు

సిఫారసు మేరకే వాడాలి

పంటలకు సిఫారసు మేరకే యూరియా వినియోగించాలి. అధిక దిగుబడి వస్తుందని ఎక్కువగా వాడొద్దు. వరిలో ఎకరాకు మూడు దఫాలుగా 60 కిలోల యూరియా వినియోగిస్తే చాలు. చాలామంది ఎక్కువ వాడుతుండడంతో సమస్య పెరుగుతోంది. – ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

హాస్టళ్లు, గురుకులాలపై నిఘా

- ఓపక్క ప్రత్యేక అధికారులు, ఇంకో పక్క ఏసీబీ తనిఖీలు
- వారానికోరోజు తనిఖీ చేసేలా ఆదేశం
- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిలో అలజడి



ఖమ్మం ముస్తఫానగర్‌లోని ఎస్టీ బాలుర పీఎంహెచ్ వసతిగృహం

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖల వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు ఇకపై ప్రభుత్వం, జిల్లా పాలన అధికారుల నిఘాలోకి రానున్నాయి. విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన, పారదర్శకత పెంపు, అవినీతిని అరికట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ప్రతీనెల వసతిగృహాలు, గురుకులాలను తనిఖీ చేసేందుకు కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియమించగా.. వీటికి తోడు ఆకస్మిక దాడులకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు కూడా భాగం కావడం విశేషం.

అన్ని శాఖలకూ బాధ్యతలు

కలెక్టర్ ఆదేశాల మేరకు వసతి గృహాలు, గురుకులాల పర్యవేక్షణకు కొత్త వ్యవస్థ ఏర్పాటైంది. ఇకపై కేవలం సంక్షేమ శాఖ అధికారులే కాక ఇతర శాఖలకు అధికారులు సైతం వారానికోసారి తప్పక తనిఖీ చేయాలి. ఈ తనిఖీ బృందంలో రెవెన్యూ, మున్సిపల్, ఎంపీడీఓ, ఎంపీఓ, విద్యాశాఖల అధికారులతో పాటు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు భాగం కానున్నారు. తద్వారా వసతి గృహాల నిర్వహణలో లోపాలు బయటపడతాయని భావిస్తున్నారు.

నివేదికలు, సమీక్షలు

జిల్లాలో రెండు నెలలుగా ప్రత్యేక అధికారులు వసతిగృహాలు, గురుకులాలను నెలకోసారి తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీలు మరింత పకడ్బందీగా జరిగేలా జిల్లా పాలన అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ శాఖల అధికారులు.. ప్రతీ బుధవారం, గురువారం తమకు కేటాయించిన వసతిగృహాలు, గురుకులాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్కరికి ఒకటి నుండి రెండు హాస్టళ్ల చొప్పున కేటాయించినట్లు తెలిసింది. ఒకటి మాత్రమే ఉన్న వారు బుధవారం, రెండు హాస్టళ్ల బాధ్యత ఉన్న వారు బుధవారం, గురువారం తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఈ సమయాన అధికారులు వసతిగృహాలు, గురుకులాల్లో తప్పనిసరిగా భోజనం చేయాలి. తనిఖీల్లో వెల్లడైన లోపాలతో నివేదికను సమర్పిస్తే అదనపు కలెక్టర్ ప్రతీ సోమవారం సమీక్షించనున్నట్లు సమాచారం.

పలు అంశాలపై ప్రత్యేక దృష్టి

తనిఖీల్లో భాగంగా అధికారులు మూడు కీలక అంశాలపై దృష్టి సారిస్తున్నారు. భోజనం నాణ్యత, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలుతో పాటు ఆహార పదార్థాల నిల్వలు, వంట గది పరిశుభ్రత, వంట సిబ్బంది పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అంతేకాక అవినీతిని అరికట్టేందుకు రేషన్ స్టాక్‌ను రిజిస్టర్లతో పోల్చి చూస్తున్నారు. విద్యార్థులు నివసించే గదులు, పడకలు, మరుగుదొడ్లు, స్నానాల గదుల పారిశుద్ధ్యంపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు వంటి మౌలిక వసతులు సరిగా ఉన్నాయా, లేదా అని పరిశీలించి విద్యార్థుల హాజరును సైతం తనిఖీ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రతీ వారం తనిఖీల్లో హాజరు నమోదు, వసతిగృహంలో ఉన్న విద్యార్థుల సంఖ్యను సరిపోలుస్తున్నారు. ఇక సాధారణ తనిఖీలతో పాటు ఏసీబీ అధికారుల ఆకస్మిక దాడులు వసతిగృహాల నిర్వాహకుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. ఇటీవల తనికెళ్ల సమీపాన మైనార్టీ గురుకులంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేయడం ఇందుకు కారణమవుతోంది. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగనున్నట్లు తెలుస్తోంది.

వారిలో ఆందోళన

అధికారుల తనిఖీలతో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సంక్షేమ అధికారుల్లో అలజడి నెలకొందని సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లోని వసతిగృహాల అధికారులు సమయపాలన పాటించడం లేదని, జిల్లా, మండల కేంద్రాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత తనిఖీలతో తమ లోపాలు ఎక్కడ వెలుగులోకి వస్తాయోనని వారిలో చర్చ జరుగుతోందని తెలిసింది. ఇక కొందరు విద్యార్థులు లేకున్నా హాజరు నమోదు చేస్తున్నారని.. సత్తుపల్లి డివిజన్‌లో ఈ వ్యవహారం అధికంగా ఉన్నట్లు చెబుతున్నారు. అధికారులు క్రమం తప్పక తనిఖీలు చేపడితే ఇలాంటి అంశాలు బయటపడడమే కాకుండా వసతిగృహాలు, గురుకులాల నిర్వహణ గాడిన పడుతుందని విద్యార్థి సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

రూ.2.74 లక్షల విలువైన నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న సబ్ కలెక్టర్ అజయ్

కల్లూరు: కల్లూరులోని ఎంపీపీఎస్ విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యాన బుధవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ మాట్లాడుతూ.. పాఠశాలను ఆలయాలుగా, గురువులను దేవుళ్లుగా భావిస్తూ విద్యార్థులు శ్రద్ధగా చదివితే ఉన్నత స్థాయికి చేరతారని తెలిపారు. విద్యార్థులకు అండగా నిలుస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ ఉయ్యూరు శ్రీవ్యాల్, రూ.2.74 లక్షల విలువైన నోట్ పుస్తకాలు సేకరించిన సభ్యుడు వరకా రామారావును అభినందించారు. అనంతరం నిట్‌లో సీటు సాధించిన ఖమ్మంపాటి యశ్వంత్‌సాయికి రూ.62,500 చెక్ అందజేశారు. హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయ సంఘాలు, పార్టీల నాయకులు పాకాల రమేశ్, కె.విజయ్‌కుమార్, తన్నీరు కృష్ణార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యకు 'కెరీర్స్ 360 ఏఏఏ ప్లస్' రేటింగ్



రేటింగ్ పోస్టర్లతో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్లు, అధ్యాపకులు

ఖమ్మంరూరల్: రూరల్ మండలం పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్‌కు 'కెరీర్స్ 360 ఏఏఏ ప్లస్'రేటింగ్ లభించిందని చైర్మన్ ఎం.శ్రీధర్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఆయన వివరాలు వెల్లడించారు. కళాశాలలో విద్యాప్రమాణాలు, పరిశోధన, ప్లేస్‌మెంట్లు, పేటెంట్లు ఇతర అంశాలపై సర్వే అనంతరం రేటింగ్ కేటాయించారని తెలిపారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయిగీతిక మాట్లాడుతూ.. ఈ రేటింగ్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలు, ఐఐటీలతో ఎంఓయూలు, పరిశోధన సులభమవుతాయని పేర్కొన్నారు. డైరెక్టర్ శ్రీవిద్య, కళాశాల ప్రిన్సిపాళ్లు జె.లక్ష్మీనారాయణ, సీహెచ్ కృష్ణ, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజేశ్, అకడమిక్ డీన్ డాక్టర్ వి.సుదర్శన్, వివిధ విభాగాధిపతులు జ్యోతి, ప్రణతి పాల్గొన్నారు.

6న ఉద్యోగుల క్రీడాజట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యుజన క్రీడల శాఖ ఆధ్వర్యాన ఈనెల 6న జిల్లాస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా జట్లను ఎంపిక చేయనున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ ఎంపికలు జరుగుతాయని డీవైఎస్ఓ టి.సునీల్ రెడ్డి తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్రికెట్, చెస్, హాకీ, ఫుట్‌బాల్, కబడ్డీ, క్యారమ్స్, లాన్ టెన్నిస్, బ్యాడ్మింటన్, పవర్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, ఖో–ఖో తదితర అంశాల్లో ఎంపికలు ఉంటాయని, ఆసక్తి ఉన్న ఉద్యోగులు పాల్గొనాలని సూచించారు.

మహిళా గురుకులంలో జాతీయస్థాయి సెమినార్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి ఆన్‌లైన్ సెమినార్ బుధవారం ముగిసింది. మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన సెమినార్‌ను హరిద్వార్ లోని గురుకుల కేంద్రియ విద్యాలయ రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఆర్‌సీ దూబే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వైదిక్ మైక్రోబయాలజీ, సైన్స్ ఇన్ బయాలజీ తదితర అంశాలపై విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, అధ్యాపకులు కేపీ ఐశ్వర్య, కె.రజిత, బి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

వైరా: వైరా పాత ఎక్సైజ్ స్టేషన్ రోడ్డులో ఓ బాలికపై లైంగికదాడికి ప్రయత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. కాలనీకి చెందిన ఓ బాలిక ఇంట్లో ఉండగా దుగ్గిరాల రత్తయ్య వెనుక నుంచి వెళ్లి లైంగికదాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆ సమయాన బాలిక తండ్రి ఇంట్లోనే నిద్రిస్తున్నాడు. బాలిక కేకలు వేయడంతో రత్తయ్య పారిపోయాడు. ఆపై బాధితురాలి ఫిర్యాదుతో నిందితుడిపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ పి.రామారావు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,800	4,000
కందులు	6,000	4,500
ఏసీ మిర్చి	15,450	8,000
ఏసీ మిర్చి తాలు	9,800	6,000
మిర్చి	8,500	4,500
పత్తి	7,550	6,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,107

ఇక్కడ ఇండస్ట్రియల్ పార్క్ లేనట్టే..

- రేమిడిచర్లలో ఏర్పాటుకు భూకేటాయింపు
- డ్రోన్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు పరిశీలన
- సరిపడా స్థలం లేదనడంతో నిరుద్యోగుల్లో ఆవేదన



రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్క్‌కు కేటాయించిన భూమి, (ఇన్‌సెట్) ప్రతిపాదిత ప్రదేశంలో బోర్డు (ఫైల్)

ఎర్రుపాలెం: జిల్లాలోని ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల 372 సర్వే నంబర్‌లోని గ్రామకంఠం భూముల్లో ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదించడంతో నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. మధిరనియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్కు కోసం 53ఎకరాలను గతంలో కేటాయించారు. భూములను రెవెన్యూ శాఖ నుంచి టీజీఐఐసీకి సైతం బదలాయించారు. ఆపై కేంద్ర ప్రభుత్వం ఇక్కడ డ్రోన్ టెస్టింగ్ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. సెంట్రల్ డిఫెన్స్ అధికారులు, జిల్లా అధికారులు గత జూలై 12న పరిశీలించారు. దీంతో తమకలలు నెరవేరే సమయం ఆసన్నమైందని నిరుద్యోగులు ఆశించగా.. చివరకు వారిఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి.

స్థలం సరిపోదని..

ఆసియాలోనే మొట్టమొదటి డ్రోన్ల టెస్టింగ్ ప్రాజెక్టు ఏర్పాటుకు రేమిడిచర్లలో ప్రతిపాదిత భూమిని అధికారులు పరిశీలించారు. ఈ పరిశ్రమ వస్తే ఉపాధికోసం అల్లాడుతున్న స్కిల్, అన్‌స్కిల్డ్ యువతలో ఆశలు చిగురించాయి. కానీ, ఇక్కడి భూమి విస్తీర్ణం డ్రోన్ల టెస్టింగ్ ప్రాజెక్టు ఏర్పాటుకు సరిపోదంటూ పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం అధికారులు నివేదిక సమర్పించారు. దీంతో పరిశ్రమ ఆదిలోనే వెనక్కి వెళ్లింది. అంతేకాక ఈ పరిశ్రమను ఏపీ రాష్ట్రంలో ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలుస్తుండడంతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లింది.

ఏపీకి వెళ్తేనే ఉపాధి

ఎర్రుపాలెం మండలం ఏపీకి సరిహద్దుగా ఉండడం .. ఇక్కడ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పలువురు ఏపీలోని విజయవాడ, కొండపల్లికి వెళ్తున్నారు. సరిహద్దుగా ఉన్న వీరులపాడు మండలం నర్సింహాపురంలో రేకుల తయారీ, తదితర ఫ్యాక్టరీల్లో పనులు చేస్తున్నారు. ఉన్నత చదువు పూర్తి చేసిన వారే కాక ఇతరులు కూడా ఉపాధి నిమిత్తం బతుకుదెరువు నిమిత్తం రోజూ వెళ్లివస్తున్నారు. రేమిడిచర్లలో ఇండిస్ట్రియల్ పార్క్, అందులో పరిశ్రమలు ఏర్పాటైతే స్థానికంగానే ఉపాధి లభిస్తుందని ఆశించినా.. ఆ ఆశలు నెరవేరకపోవడం వారిని ఆవేదనకు గురిచేస్తోంది. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇండస్ట్రియల్ పార్క్ మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశ్రమలు ఏర్పాటైతేనే ఉపాధి



రేమిడిచర్ల భూములు ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు స్థానికంగా ఉపాధి లభించి ఇతరచోట్లకు వెళ్లే బాధ తప్పుతుంది. నైపుణం కలిగిన యువత కూడా ఉన్నందున ప్రభుత్వం చొరవ చూపాలి.

–నంద్రు హేమలత, బీటెక్ విద్యార్థిని, ఎర్రుపాలెం

ఉపాధి కోసం ఎదురుచూపులు



పీజీ పూర్తిచేసిన నాలాంటి ఎందరో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాం. ఈ ప్రాంతంలోనే పరిశ్రమలు ఏర్పాటైతే నిరుద్యోగ యువతకు కొంత ఊరట లభిస్తుంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

–దేవరకొండ రాజేశ్, ఎంటెక్, ఎర్రుపాలెం

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం



రేమిడిచర్లలో 53ఎకరాలను టీజీఐఐసీకి అప్పగించాం. డ్రోన్ టెస్టింగ్ ప్రాజెక్టు ఏర్పాటుకు సెంట్రల్ డిఫెన్స్ అధికారులు పరిశీలించారు. కానీ పరిశ్రమకు భూమి చాలదని ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత మా దృష్టికి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం ఉంటుంది.

–ఎం.ఉషాశారద, తహసీల్దార్, ఎర్రుపాలెం

యూరియా కోసం పడిగాపులు



పాలేరులోని కేంద్రం వద్ద వేచి ఉన్న రైతులు



రైతును తోసేస్తున్న ఎంపీఓ శివ



కాకరవాయి జీపీలో గుమికూడిన అన్నదాతలు

నేలకొండపల్లి: యూరియా సరఫరాలో అవాంతరాలతో రైతులు పడుతున్న ఇక్కట్లు తీరడం లేదు. మండలంలోని 10 పీఏసీఎస్‌లతో పాటు మరో ఐదు సబ్ సెంటర్లకు 110 చొప్పున యూరియా బస్తాలు సరఫరా చేశారు. అయితే, ప్రతీ కేంద్రం వద్దకు బుధవారం వందలాదిగా రైతులు రావడంతో ఒక్కో బస్తా మాత్రమే కూపన్ల ఆధారంగా పంపిణీ చేశారు. కానీ, కొన్నిచోట్ల 110 బస్తాలకు 200 కూపన్లు జారీ చేయడంతో మిగతా వారు అధికారులను నిలదీశారు. ఖమ్మం ఆర్‌డీఓ నరసింహారావు పలు కేంద్రాల్లో యూరియా పంపిణీ పర్యవేక్షించారు. తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యర్రయ్య, ఏఓ ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు వెళ్లండి..

నేలకొండపల్లి మండలం రాజారాంపేట సొసైటీ వద్ద రైతుకు ఒకే బస్తా ఇవ్వడంపై పలువురు ప్రశ్నించారు. దీంతో కేంద్రం ఇన్‌చార్జ్, ఎంపీఓ శివ రైతులతో వాగ్వాదానికి దిగడమే కాక కోర్టుకు వెళ్లాలని సూచిస్తూ కొందరిని బయటకు తోసేసే ప్రయత్నం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తిరుమలాయపాలెం: యూరియా కోసం రైతులు తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు. ఎస్ఐ జగదీశ్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని 14 కేంద్రాల్లో ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున 1,540 మందికి పంపిణీ చేశారు. ఇంకా చాలా మందికి అందకపోవడంతో కూపన్లు జారీ చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండు వారాల్లో అందరికీ యూరియా అందిస్తామని ఏఓ సీతారాంరెడ్డి తెలిపారు.

కూసుమంచి: మండలానికి 1,870 బస్తాల యూరియా రావడంతో కల్లూరుగూడెం, చేగొమ్మ, జక్కేపల్లి పీఏసీఎస్, మరో 14 సబ్‌సెంటర్లలో పంపిణీ చేశారు. మిగతా వారికి యూరియా అందకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. తహసీల్దార్ రవికుమార్, ఏడీఏ సతీశ్, ఎంపీడీఓ పర్యవేక్షించారు.

బస్సులన్నీ దామరచర్ల వైపే..



బస్సులు లేక ఖాళీగా ఉన్న ఖమ్మం పాత బస్టాండ్

ఖమ్మంమయూరిసెంటర్: చండ్రుగొండ మండలం దామరచర్లలో సీఎం రేవంత్‌రెడ్డి హాజరైన సభకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, మహిళా సంఘాల సభ్యులను తరలించారు. ఇందుకోసం ఆర్టీసీ బస్సులు సమకూర్చారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని డిపోల బస్సులను అటే కేటాయించడంతో మిగతా ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. బస్టాండ్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసినా పల్లెవెలుగు బస్సులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన జనం ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

పాఠశాలల్లో మైనార్టీ అధికారి తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ముజాహిద్

రఘునాథపాలెం: జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ బుధవారం మండలంలోని ఈర్లపుడి జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజన అమలును పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే, సరుకుల నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించగా,పాఠశాల ఆవరణలో ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంత నిర్మించాలని గ్రామపంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈజీఎస్ ఏపీఓ పద్మయ్యనాయుడు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఈశ్వరాచారి, ఇన్‌చార్జ్ హెచ్ఎం మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన మట్టి గోడ

బోనకల్: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో బోనకల్ ఎస్సీకాలనీలో బుధవారం అంతోటి మాణిక్యమ్మ ఇంటి మట్టిగోడ కూలింది. ఆ సమయాన ఆమె ఇంట్లోనే ఉండగా.. పక్కన గోడ పడడంతో ప్రమాదం తప్పినట్లయింది. కాగా, ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరినందున ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని మాణిక్యమ్మ కోరింది.

ఆటోలో వచ్చి దోపిడీ

లారీడ్రైవర్, హోటల్ యజమాని నుంచి రూ.18 వేలు చోరీ



నిందితులు వచ్చిన ఆటో

తిరుమలాయపాలెం: ఆటోలో వచ్చిన నలుగురు వ్యక్తులు లారీడ్రైవర్, హోటల్ యజమానిని చంపుతామని బెదిరించి రూ.18 వేలు ఎత్తుకెళ్లిన ఘటన ఇది. మండలంలోని పాతర్లపాడు స్టేజీ సమీపాన ఓ దాబాలో బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఆటోలో నలుగురు వచ్చారు. దాబా నిర్వాహకుడు రుస్తుంఖాన్‌పై దాడి చేసి డబ్బు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించగా, డబ్బులు లేవని చెప్పడంతో రూ.10 వేలు ఫోన్‌పే కొట్టించుకున్నారు. అదే దాబాలో టీ తాగుతున్న గుజరాత్ లారీడ్రైవర్ దిలీప్ ముచ్చర్‌పైనా దాడి చేసి ఆయన నుంచి రూ.8 వేలు తీసుకుని పారిపోయారు. కాగా, దాబాలోని ఓ వ్యక్తి ఆటో ఫొటోలు తీయగా, ఆటో నంబర్, ఫోన్‌పే నంబర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి మృతి చెందాడనే మనస్తాపంతో ఆత్మహత్య

ఖమ్మంక్రైం: తొమ్మిది నెలల క్రితం తండ్రి మృతి చెందినప్పటి నుంచి మనస్తాపంతో ఉన్న కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన వీరెల్లి వెంకట్రావు(40) బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆయన తండ్రి భిక్షమయ్య 9 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆవేదన చెందుతున్న వెంకట్రావు గత నెల 30న ఇంట్లో ఎవరూ లేని సమయాన గడ్డి మందు తాగాడు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయన భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 6వ డివిజన్ ప్రశాంతినగర్‌కు చెందిన మహిళ పాముకాటుతో మృతి చెందింది. ప్రశాంతినగర్‌కు చెందిన మునిగంటి పావని (23) గత నెల 23న కిరాణా సరుకులు తీసుకొస్తుండగా పాము కాటుకు గురైంది. ఆమెకు చికిత్స చేయిస్తుండగా బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త హరీశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

జ్వరంతో బాలుడి మృతి



వర్షిక్ (ఫైల్)

కూసుమంచి: మండలంలోని చింతలతండాకు చెందిన బాలుడు ధరావత్ వర్షిక్‌తేజ (6) జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. బాలుడికి జ్వరం వస్తుండగా వారం క్రితం తల్లిదండ్రులు ఖమ్మంలోని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించడంతో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కాల్వలో పడి మహిళ మృతి

దుస్తులు ఉతికేందుకు వెళ్లగా ప్రమాదం?



దుగ్గిరాల శిరీష (ఫైల్)

ఏన్కూరు: సాగర్ కాల్వలో దుస్తులు ఉతికేందుకు వెళ్లిన మహిళ ప్రమాదవశాత్తు అందులో పడడంతో మృతి చెందింది. ఏన్కూరుకు చెందిన దుగ్గిరాల శిరీష (27) సమీపంలోని సాగర్‌కాల్వలో బట్టలు ఉతికేందుకు రోజూ వెళ్తోంది. ఉదయం ఆమెను భర్త దుగ్గిరాల నాగరాజు బైక్‌పై తీసుకెళ్లి కాల్వ వద్ద దింపాడు. రెండు గంటలు దాటాక శిరీషకు ఆమె సోదరి అనూష ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో ఆమె స్కూటీపై కాల్వ వద్దకు వెళ్లగా అక్కడ బట్టలు, ఫోన్ ఉండడంతో బావ నాగరాజు, బంధువులకు చెప్పగా గాలింపు చేపట్టారు. చివరకు సాగర్ కాల్వ లాకుల వద్ద శిరీష మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అన్నం శ్రీనివాసరావు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, శిరీషకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై మృతురాలి సోదరి అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రఫీ తెలిపారు.

టీపీటీఎఫ్ నాయకుడు నాగేశ్వరరావు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

ఖమ్మంసహకారనగర్/ఖమ్మంఅర్బన్: టీపీటీఎఫ్ నాయకుడు రాయప్రోలు నాగేశ్వరరావు (60) బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు గుండెపోటు రావడంతో చికిత్స చేయిస్తుండగా కన్నుమూశారని సంఘం బాధ్యులు తెలిపారు. ప్రస్తుతం నాగేశ్వరరావు ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థి దశలోనే పీడీఎస్‌యూలో చేరిన ఆయన ఉపాధ్యాయుడిగా నియామకమయ్యాక ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్, తెలంగాణ ఏర్పడ్డాక తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్‌లో ఖమ్మం అర్బన్ మండలం ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కౌన్సిలర్‌గా వ్యవహరించారు. నాగేశ్వరరావు మృతిపై టీపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు వి.మనోహర్‌రాజు, నాగిరెడ్డి, ఎస్.విజయ్, పద్మ, నాగేశ్వరరావు, వెంగళరావు, మల్లయ్య, రమాదేవి, సంధ్యారాణి, ఉమాదేవి, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, భాస్కర్, పుల్లయ్య, ఎస్.వెంకటేశ్వర్లుతోపాటు హరినాథ్, భాస్కర్‌రెడ్డి, నారాయణ, మల్లెమడుగు పాఠశాల హెచ్ఎం కె.సాంబమూర్తి, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

అత్యధికం తిరుమలాయపాలెంలో..

జీపీల వారీగా తేలిన ఓటర్ల లెక్క ● మొత్తం ఓటర్లలో మహిళలే ఎక్కువ

జిల్లాలోని గ్రామపంచాయతీ వారీగా ఓటర్ల లెక్క తేలింది. ఇరవై మండలాల్లో జీపీల వారీగా పురుషులు, మహిళలు, ఇతరులతో సహా ఓటర్ల తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ జాబితా ఆధారంగా తిరుమలాయపాలెం మండలం 50,771 మంది ఓటర్లతో అగ్రస్థానాన నిలిచింది. ఇక వైరా మండలంలో అత్యల్పంగా 27,306 మందే ఉన్నారు. ఇతరుల కేటగిరీలో జిల్లా అంతటా 22మంది ఓటర్లు నమోదయ్యారు. – ఖమ్మం సహకారనగర్

మండలాల వారీగా జీపీలు, వార్డులు, ఓటర్ల వివరాలు

మండలం	జీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
తిరుమలాయపాలెం	40	356	24,557	26,213	01	50,771
కూసుమంచి	41	364	24,251	25,896	02	50,149
ముదిగొండ	25	246	23,274	25,278	02	48,554
నేలకొండపల్లి	32	300	23,691	25,841	01	49,533
తల్లాడ	27	252	22,547	23,713	01	46,261
సింగరేణి	41	356	22,205	23,205	01	45,411
పెనుబల్లి	33	298	21,342	22,531	00	43,873
కొణిజర్ల	27	254	20,370	21,493	01	41,864
చింతకాని	26	248	19,987	21,720	00	41,707
రఘునాథపాలెం	37	308	19,420	21,366	04	40,790
ఎర్రుపాలెం	31	284	19,616	20,808	01	40,425
వేంసూరు	26	244	18,122	18,870	00	36,992
బోనకల్	22	210	17,611	18,769	01	36,381
సత్తుపల్లి	21	208	17,424	18,735	01	36,160
ఖమ్మం రూరల్	21	202	17,155	18,640	02	35,797
కామేపల్లి	24	218	17,437	18,102	00	35,539
కల్లూరు	23	214	17,364	18,166	00	35,530
మధిర	27	236	15,306	16,419	03	31,728
ఏన్కూరు	25	216	13,390	14,530	00	27,920
వైరా	22	200	13,175	14,130	01	27,306
మొత్తం	571	5214	3,88,244	4,14,425	22	8,02,691

అటు సీత.. ఇటు రాధ!

ఇందిరమ్మ ఇంటి స్థలంపై వివాదం

బోనకల్: మండలంలోని రావల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి స్థల విషయమై వివాదం నెలకొనగా ఇరువర్గాలతో అధికారులు చర్చించారు. గతంలో కులవృత్తులతో జీవిస్తున్న పలువురికి ప్రభుత్వం స్థలాలు కేటాయించగా గ్రామంలో రాచకొండ సీతకు సైతం కేటాయించారు. కొన్నేళ్ల పాటు అక్కడే ఉన్న ఆమె మరో గ్రామానికి వెళ్లింది. దీంతో ఆమె బంధువైన రాచకొండ రాధకు ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో ఆ స్థలంలో ముగ్గులు పోశారు. గ్రామంలో నాయకులు రెండు వర్గాలుగా ఉండడంతో నిర్మాణం జరపొద్దని ఓ వర్గం, ఆ స్థలాన్ని రాచకొండ రాధ కొనుగోలు చేసిందని ఇంకో వర్గం వారు వాదించారు. ఈ విషయం జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి వెళ్లగా ఆమె నెల క్రితం పరిశీలించి వివాదం లేని స్థలంలోనే ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. దీంతో ఎస్ఐ పి.వెంకన్న, తహసీల్దార్ రమాదేవి బుధవారం ఇరు వర్గాలను పిలిచి విచారణ చేపట్టారు. గతంలో కొన్నాళ్లు ఉన్న రాచకొండ సీతను ఈ నెల 6న పిలిపించే వరకు ఇరు వర్గాలు సమన్వయంతో ఉండాలని సూచించారు.

కార్డుదారులందరికీ బియ్యం అందించాలి..



బియ్యం తూకాన్ని పరిశీలిస్తున్న డీసీఎస్ఓ చందన్‌కుమార్

రఘునాథపాలెం: రేషన్ డీలర్లు కార్డుదారులందరికీ సకాలంలో సన్న బియ్యం పంపిణీ చేయాలని జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి చందన్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని కోయచలక, రేగులచలక, రఘునాథపాలెం, వేపకుంట్ల, హర్యతండాల్లో రేషన్ షాపులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి బియ్యం పంపిణీ, షాపుల సమయపాలనపై ఆరా తీశారు. కాగా, కొత్త కార్డుదారులకు కూడా ఈ నెల నుంచి బియ్యం పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. ఆ తర్వాత రఘునాథపాలెంలో కేజీబీవీని తనిఖీ చేసిన డీసీఎస్ఓ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెనూ అమలును తెలుసుకున్నారు. సివిల్ సప్లయీస్ డీటీ హెచ్.వెంకటేశ్వర్లు ఉన్నారు.

సెలవులో సబ్ రిజిస్ట్రార్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రిజిస్ట్రార్ కార్యాలయంలోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు సెలవులో వెళ్లారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్–2 కిశోర్‌రెడ్డి కొద్దిరోజులుగా సెలవులో ఉండగా.. తాజాగా ఈ నెల 1 నుంచి నుంచి జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1 సంపత్ నెల పాటు సెలవు పెట్టినట్లు తెలిసింది. వీరి స్థానంలో సీనియర్ అసిస్టెంట్ మునీందర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. అయితే, చిట్ రిజిస్ట్రార్‌కు కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది.



జాతీయ పోషకాహార వారోత్సవాలు

ఫుడ్ ఫర్ టీన్స్



పిల్లల విషయంలో పెద్దవారికి ఒక రకమైన ఆందోళన ఉంటే... కాస్త పెద్ద పిల్లల విషయంలో ఇంకో రకమైన ఇబ్బందులు ఉంటాయి. అంటే పదేళ్లు దాటి టీనేజ్‌లో ఉండే పిల్లల్లో మరికొన్ని సమస్యలు చూస్తుంటాం. ఈ రోజుల్లో అయితే టీనేజ్ పిల్లల్లో ఆందోళన, మానసిక ఒత్తిడి, అధికంగా కోపం, డిప్రెషన్ వంటివి తరచూ వింటున్నాం. వారు తినే ఆహారపు ప్రభావం మానసిక, శారీరక స్థితిపైన చూపుతుంది. అందుకని, టీనేజ్ పిల్లలున్న ఇంట్లో పోషకాహారం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి.

13–19 ఏళ్ల మధ్య ఫిజికల్, మెంటల్ గ్రోత్ వేగంగా మార్పు చెందుతుంటుంది. ఇలాంటప్పుడు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎమ్‌ఆర్) కొన్ని సాధారణ సూచనలు చేసింది. వాటి ఆధారంగా పోషకాహారాన్ని ఈ వయసు పిల్లలకు సరైన మొత్తంలో ఇవ్వాలి. అలాగే, ఆ ఆహారం మనసుకు సంతృపినిచ్చేలా ఉండాలి.

టీనేజ్ పిల్లల బరువు, ఎత్తు, చేసే పనులు.. ఇవన్నీ దృష్టిలో నిపుణుల సలహాతో సమతుల ఆహారాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో కాకుండా రోజులో 5-6 సార్లు సమయాన్ని బట్టి పైన టేబుల్‌లో ఇచ్చిన హెల్తీ ప్లేట్‌ను తయారుచేసుకోవచ్చు.

బ్రేక్‌ఫాస్ట్
కప్పు గోధుమ ఉప్మా /దోసె - 2 / కిచిడీ - కప్పు / రాగి రొట్టె - 2 -3 / ఇడ్లీ - 2-3 + కప్పు సాంబార్ + ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లేట్ + కొద్దిపాటి గింజలు.

ఉదయం స్నాక్స్
పండు (ఆపిల్ లేదా అరటి లేదా నారింజ) + కొద్దిగా డ్రైఫ్రూట్స్ / పల్లీ చిక్కీ / వేపిన శనగలు / వేయించిన అవిసెగింజలు / డ్రై ఫ్రూట్ బార్ / ఉడికించిన వేరుశెనగ

మధ్యాహ్న భోజనం
అన్నం - 1 కప్పు లేదా గోధుమ రొట్టె - 2-3 / తృణ ధాన్యాలు - 1 కప్పు + ఆకుకూరలు - 1 కప్పు + మిక్స్‌డ్ వెజిటబుల్స్ - 1 కప్పు + చికెన్ బ్రెస్ట్ - 100 గ్రా / గుడ్డు - 1 / పనీర్ - 100 గ్రా / చేప - 100–120 గ్రా. + పెరుగు - 1 కప్పు

సాయంత్రం స్నాక్స్
మొలకెత్తిన గింజలు, విత్తనాలు - 30 గ్రా + చియా సీడ్స్ + నిమ్మ రసం/ పాలు/ పండు జ్యూస్ లేదా సూప్.

రాత్రి భోజనం
మధ్యాహ్న భోజనం మాదిరిగానే + గ్రిల్ చేసిన చికెన్ బ్రెస్ట్ అన్నంతో లేదా రొట్టెతో + కూరగాయలు + ఉడికించిన బ్రొకోలీ

కిలో కేలరీలు : అబ్బాయిలకు 2200-3200 : అమ్మాయిలకు 1800 - 2500
ప్రొటీన్లు : అబ్బాయిలకు - 52 గ్రా. : అమ్మాయిలకు - 46 గ్రా.
కొవ్వులు (Fat) : 25-35%
కార్బోహైడ్రేట్స్ : 45-65%
విటమిన్-ఎ : 600-900 మైక్రోగ్రాములు
విటమిన్ - సి : 45-75 మి.గ్రా
కాల్షియం : 1300 మి.గ్రా   నీళ్లు - 8 నుంచి 12 గ్లాసులు



- డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

ఫుడ్ గ్రూప్స్, పరిమాణం

ఏదైనా పండు	- 1 రోజుకు 2-3 సర్వింగ్స్
కూరగాయలు	- రోజుకు 3-5 సర్వింగ్స్ (ఉడికించినవి లేదా వండినవి)
ధాన్యంతో వండినవి	- రోజుకు 6 - 8 సర్వింగ్స్ (1 సర్వింగ్ - ½ కప్పు ఉడికిన అన్నం/సిరిధాన్యం/గోధుమ)
డెయిరీ ఉత్పత్తులు	- రోజుకు 2 - 3 కప్పులు (పాలు, పెరుగు, చీజ్ రూపంలో)
ఆరోగ్యకరమైన కొవ్వులు	- రోజుకు 1 టేబుల్ స్పూన్ (నూనె, గింజలు, విత్తనాలు మొదలైనవి)
ప్రొటీన్ ఆహారం	- మాంసం, గుడ్డు మొదలైనవి (1 సర్వింగ్)

● మన(సు)లో మాట

తీవ్ర మనోవ్యాధికి సంజీవని!

మేము కోయంబత్తూరులో సెటిల్ అయిన తెలుగు వాళ్ళము. మా అబ్బాయి బీటెక్ తర్వాత ఎం. ఎస్. కోసం సంవత్సరం క్రితం అమెరికాకు వెళ్ళాడు. మొదట 6 నెలలు బాగానే ఉన్నాడు. తర్వాత అతని ఆలోచనలు, ప్రవర్తనలు మారాయి. అమెరికాలో ఉన్న పోలీసులు, గూఢాచారులు తనని వెంబడిస్తున్నారని తన మెదడు మీద, ఎలాన్ మస్క్, ట్రంప్ ప్రయోగాలు చేస్తున్నారని అనుమానంతో భయపడుతూ–ఉండేవాడు. ఆ ప్రవర్తన ఎక్కువై బాగా చికాకు చేస్తే అక్కడే ఉండే మా చుట్టాలు 6 నెలల క్రింద ఇండియాకు పంపించారు. ఎయిర్ పోర్టులో దిగాక నేరుగా చెన్నైలో ఒక ఆస్పత్రిలో అడ్మిట్ చేశాము. 'స్కిజోఫ్రినియా' లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, బాగా అగ్రెసివ్‌గా, సూసైడల్ ఆలోచనలతో ఉన్నాడని అక్కడి డాక్టర్లు ఇ.సి.టి. ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మా ఫ్యామిలీ డాక్టర్‌ని అడిగితే ఆయన ఇ.సి.టి. వల్ల మెదడు దెబ్బతింటుంది, భవిషత్తులో ఇబ్బందులు వస్తాయని చెప్పారని, మేము ఆ ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసి వేరే హాస్పిటల్‌కి తీసుకెళ్లాము. పెద్దగా ఫలితం కనిపించకపోయేసరికి ఇంగ్లీష్ వైద్యం కాకుండా వేరేవైద్యానికి వెళ్ళాము. చాలా రోజులు ఆ మందులు వాడినా ఎలాంటి మార్పూ లేదు. దయచేసి మాకు ఏదైనా మంచి దారి చూపగలరు.

- సోమలింగేశ్వరరావు, కోయంబత్తూరు

చాలామందిలో అంతర్గతంగా ఉండే ఇలాంటి సమస్యను సాక్షి ద్వారా తెలియజేసినందుకు మీకు నా అభినందనలు. మీ అబ్బాయికి వచ్చిన స్కిజోఫ్రీనియా వ్యాధి వలన ఎంతగా సంఘర్షణకి గురయ్యారో అర్థం అవుతోంది. ముందుగా మీరు అర్థం చేసుకోవాల్సింది, మెదడులో వచ్చే కొన్ని రసాయనిక మార్పుల వల్లనే ఇలాంటి మానసిక సమస్యలు వస్తాయని, అవి తగ్గాలంటే ఆ రసాయనాలని సాధారణ స్థితికి తీసుకురావాలనీ మానసిక వైద్యులు మొదటిగా మందులు, కౌన్సెలింగ్ ద్వారా మార్పులు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తారు.

అయితే కొన్నిసార్లు ఆ సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు లేదా పేషెంటుకి ఆత్మహత్య ఆలోచనలు, జబ్బువల్ల ఇతరులకు హాని చేసేంత ఆవేశం, కోపం, ఉన్నప్పుడు, మందులు పని చేయడానికి చాలా సమయం పట్టొచ్చు: అలాంటప్పుడు పేషెంటుకి కుటుంబ సభ్యులకి జరిగే నష్టం ఎక్కువ. దీన్ని నివారించడం కోసం అత్యంత వేగంగా. ప్రభావ వంతంగా పనిచేసే ఒక సంజీవని లాంటి వైద్య విధానమే' ఇ.సి.టి. ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ. అంతమంచి చికిత్స విధానాన్ని వాడుక భాషలో 'షాక్ ట్రీట్మెంట్' అంటారు. అదే అన్ని సమస్యలకి, అపోహలకి కారణం అయింది. దీనివల్ల మనిషికి ప్రాణహాని అని లేదా నరాలు చచ్చుబడి, సంసారానికి పనికి రారు అని అనేక అపోహలు, సాధారణ ప్రజలతో పాటు, కొంత మంది వైద్యుల్లో కూడా ఉన్నాయి. మన శరీరంలో ఇతర జ్ఞానేంద్రియాలు, కండరాలు ఇతర వ్యవస్థలన్ని పనిచేయడానికి మెదడులో ఉత్పత్తి అయ్యే కరెంట్ చాలా ముఖ్యం. దాన్ని మార్చడం ద్వారా మెదడులోని రసాయనాల అసమతుల్యాను కూడా సరి చేయవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే ఫోన్ లేదా కంప్యూటర్ కి వైరస్ వచ్చి పని చేయకపోతే రీసెట్ ' బటన్ నొక్కి దాన్ని పనిచేసే కండిషన్‌కి ఎలా తీసుకు వస్తామో ఇ.సి.టి. కూడా మెదడుని అలాగే రీసెట్ చేస్తుంది. దీనివల్ల దీర్ఘకాలికంగా ఎలాంటి సమస్యలు వస్తాయని ఇప్పటి వరకు ఎలాంటి శాస్త్రీయ పరిశోధనా తేల్చలేదు. ఒక పేషెంట్ అన్ని రకాలుగా శారీరకంగా ఫిట్‌గా ఉంటేనే ఇ.సి.టి. చికిత్స చేస్తారు. మీ అబ్బాయిని పరీక్షించిన డాక్టరు అన్ని పరీక్షలు చేసి ఎలాంటి ఇబ్బంది లేకపోతేనే ఇ.సి.టి. ట్రీట్మెంట్ గురించి చెప్పి ఉంటారు. కాబట్టి ఎలాంటి అపోహలు, భయాలు లేకుండా చికిత్స ఇప్పించి, మీ వాడి జబ్బు లక్షణాలను తొందరగా తగ్గించుకోండి.

మీ అలాగే వాళ్ళు చెప్పినన్ని రోజులు మందులు వాడితే జబ్బు మళ్ళీ తిరిగబెట్టకుండా ఉంటుంది. ఆల్ ది బెస్ట్ !




డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బయోపిక్

వెండితెరపై కశ్మీర్ కోయిల

మనకు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి తెలుసు.
మహనీయ కర్నాటక సంగీత విద్వాంసురాలు.
లతా మంగేష్కర్ తెలుసు. సినీ సంగీతానికి రారాణి.
కాని రాజ్ బేగం తెలియదు.
ఆమె వీరిద్దరి కాలం నుంచే పాడుతోంది.
వీరితో సమానంగా కశ్మీర్ ప్రజల జేజేలు అందుకుంది.
కశ్మీర్ కోయిల బిరుదు అందుకుంది.
కాని ఆమె దేశానికి తెలియడానికి ఇంత కాలం పట్టింది.
అదికూడా ఇప్పుడు ఆమె జీవితం ఆధారంగా తీసిన 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమా అమేజాన్‌లో విడుదల అయ్యాక.



1950ల కాలం ఊహించండి.

కశ్మీర్ పర్వత ప్రాంతం. అక్కడివన్నీ గిరిజన సంప్రదయాలు. కశ్మీర్‌కే తనదైన గొప్ప సంగీతం, గానం, వాయిద్యం, కవిత్వం, గీతం... ఉన్నాయి. అక్కడ కశ్మీరీ భాషలో ఎంతో మంచి సాహిత్యం ఉంది. కాని అక్కడ ఉర్దూ, హిందీ కూడా వాడుకలో ఉంది. నిరంతరం ఏదో ఒక అలజడికి లోనయిన ఆ ప్రాంతంలో స్త్రీలు ఏ పనిలో అయినా ముందుకు రావడం కష్టంగా ఉండేది. వారి కళ కూడా నాలుగ్గోడల మధ్యే తప్ప బహిరంగం కావడానికి లేదు.

ఈ నియమాన్ని బ్రేక్ చేసిన గాయని రాజ్‌బేగం.

1927లో శ్రీనగర్‌లో జన్మించిన రాజ్‌బేగం బాల్యంలోనే పాటను గ్రహించింది. అది అక్కడ కురిసే మంచులా ఆమెలో సహజంగా ఉద్భవించింది. గిరిజన గీతాలు, జానపద పాటలు పెళ్లిళ్లలో పాడటం మొదలు పెట్టింది. 1950లలో ఆమె మొదటిసారి ఆల్ ఇండియా రేడియో కశ్మీర్ స్టేషన్‌లో పాడింది. మరో నాలుగేళ్లకు అదే రేడియోలో స్టాఫర్ అయ్యింది. ఆ తర్వాత బహిరంగ వేదికల మీద పాడసాగింది. తన జీవిత కాలంలో కనీసం రెండు వేల పాటలు ఆమె పాడింది. అయితే దురదృష్టవశాత్తు ఏ పాట రికార్డింగూ అందుబాటులో లేదు. కశ్మీర్ సంగీతానికి ఆమె చేసిన సేవకు 2002లో 'పద్మశ్రీ' దక్కినా ఆమెకు రావాల్సిన ఖ్యాతి రాలేదు. 2016లో రాజ్ బేగం మరణించింది. జనం ఆమెను అక్కడ నిత్యం తలుచుకుంటూనే ఉంటారు. దేశానికి ఆమె పేరు చేరలేదు. కశ్మీర్‌లో పుట్టి పెరిగి అమెరికాలో చదువుకొని వచ్చిన అక్కడే స్థిరపడ్డ దర్శకుడు డానిష్ రెంజు ఆమె బయోపిక్‌ను తీసే అవకాశం పొందగలిగాడు. రాజ్ బేగం జీవితాన్ని, సంగీతాన్ని 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'గా తీశాడు. అమేజాన్‌లో ఆ సినిమా ఆగస్టు 29 నుంచి స్ట్రీమ్ అవుతూ విమర్శకుల ప్రశంసలు పొందుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ సంగీత అభిమానుల మెప్పు అందుకుంటోంది. దర్శకుడు ఫర్హాన్ అఖ్తర్ ఈ సినిమాకు ఒక నిర్మాత కావడం విశేషం.

***

'అమ్మా... దేవుడు స్త్రీలను పుట్టించింది కేవలం పెళ్లి కోసం కాదు' అని తన యవ్వన కాలం నుంచి తిరగబడుతూ తన దారిని నిర్మించుకుంటుంది రాజ్ బేగం 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమాలో. పెళ్లిళ్లలో పాడుతూ గుర్తింపు పొందిన రాజ్ బేగం రేడియో కశ్మీర్‌లో ఆడిషన్ ఇవ్వడానికి వెళితే అక్కడంతా అబ్బాయిలే ఉండి 'నువ్వొచ్చావ్ ఏంటి' అన్నట్టుగా చూస్తారు. అయినా వారిని ఎదిరించి ఆడిషన్ ఇచ్చి ఎంపికవుతుంది రాజ్ బేగం. అయితే స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఆమె తన సొంత పేరును చెప్పుకోవడానికి వీలుండదు. 'నూర్ బేగం' పేరుతో రేడియోలో పాడుతుంది. ఇది కొన్నాళ్లకు తెలిసి ఆమె ఊరి వాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఆడపిల్ల ఇలా మగవాళ్లుండే చోటుకు వెళ్లి పాడటం ఏంటని రాళ్లతో కొడతారు. బహిరంగ వేదికల మీదకు రాకుండా చూస్తారు. రాజ్ బేగం ఇవన్నీ తట్టుకుని తన పాటను జనం వద్దకు తీసుకువెళుతుంది. ఏ జనమైతే ముందు వ్యతిరేకించారో వారంతా ఆమె అభిమానులుగా మారతారు. ఆమెను తమ ప్రాంతపు సాంస్కృతిక రాయబారిగా చేసుకుంటారు. ఆమె పాటలకు పరవశిస్తారు. తన జీవితంలో వేల కొలది పాటలు పాడి రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చింది రాజ్ బేగం. ఆమె వేసిన దారిలో ఇవాళ ఎందరో కశ్మీర్ గాయనులు పాటలు పాడుతున్నారు. రాజ్ ఎదుర్కొన్న వ్యతిరేకత వీరికి లేదు.



'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'లో యంగ్ రాజ్ బేగంగా సబా ఆజాద్, వృద్ధ రాజ్ బేగంగా సోని రాజ్‌దాన్ (ఆలియా భట్ తల్లి) నటించారు. సినిమా హిందీ భాషలో సాగినా పాటలు కశ్మీర్ సువాసనలతో ఉంటాయి. కశ్మీర్ జీవితం, సంప్రదాయాలు, మాటా, వరుస... అన్నీ ఈ సినిమాలో కనిపిస్తాయి.

ఇన్నాళ్లకు కశ్మీర్ సినిమా ఒకటి వచ్చింది.

అది ఒక గాయని గురించి కావడం సంతోషపడవలసిన సంగతి.

కళ మరణించదని మరో సారి నిరూపితమైంది.



● పద్మశ్రీ అందుకుంటున్న రాజ్ బేగం

● పేరెంటింగ్

ఒక హీరో గురించి...

పిల్లలకు ఎప్పుడూ బడి పాఠాలే కాదు బతుకు పాఠాలు, నైతిక విలువల గురించి కూడా చెప్పాలి. అదే నిజమైన పేరెంటింగ్. ఒక తండ్రి తన పిల్లాడికి సులువైన భాషలో మంచీచెడుల గురించి చెప్పిన మాటలు నెటిజనులకు తెగ నచ్చాయి.

ఫైనాన్షియల్ సర్వీసెస్ 'మైఫండ్‌బాక్స్' సీయీవో అనూజ్ పాల్...

'నీ గురించి స్కూల్‌లో ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా?' అని తన చిన్నారిని అడిగాడు.



'నేను ఒకరిని కొట్టాను' అన్నాడు అద్విక్.

'ఎవరిని కొట్టావు? ఎందుకు కొట్టావు?' అని అడిగిన తండ్రి... 'ఒక అమ్మాయిని అలా కొట్టవచ్చా?

నువ్వు ఆ అమ్మాయి వస్తువు లాగేసుకున్నావు. ఇతరుల వస్తువులు అలా లాక్కోవచ్చా? మీ క్లాస్‌మేట్స్ ఇద్దరు కలిసి నిన్ను కొట్టారనుకో, నీకు బాధగా అనిపించదా? వాళ్లు చేసింది తప్పు అనిపించదా... ఇది సరే, నువ్వు భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నావు? హీరో అవుతావా? విలన్ అవుతావా?' అని అడిగాడు అనూజ్.

'హీరో' అని జవాబు చెప్పాడు అద్విక్.

'తప్పు చేసినప్పుడు సారీ చెప్పేవారే నిజమైన హీరోలు. మరి నువ్వు సారీ చెబుతావా?' అని అడిగాడు తండ్రి. అద్విత్ ఆ అమ్మాయికి 'సారీ' చెప్పాడు! ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

● టెక్నో ఉమెన్

ఛాయా చిత్రం



'మెటా'లో దశాబ్దకాలం పాటు పనిచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్ ఛాయ నాయక్ తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ'లో చేరింది. ఓపెన్ ఏఐలో ఆమె 'స్పెషల్ ఇనిషియేటివ్స్' టీమ్‌లో పనిచేయనుంది.

'సరియైన సమయంలో సరియైన నిర్ణయం' అని కంపెనీ మార్పు గురించి స్పందించింది ఛాయ. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఛాయ నాయక్ సెక్యూరిటీ, పీస్ స్టడీస్‌లో డిగ్రీ చేసింది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పబ్లిక్ పాలసీ, డాటా సైన్స్‌లో మాస్టర్స్ ప్రోగ్రామ్ చేసింది. పుణేలో 'పాత్‌వేస్ టు ఎంపవర్‌మెంట్'లో ప్రాజెక్ట్ మెనేజర్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించింది. ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబిలిటీ కార్యాలయం(యూఎస్)లో జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్‌మేషన్ స్పెషలిస్ట్‌గా పనిచేసింది. 'ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఫ్యూచర్'లో కన్సల్టెంట్‌గా, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో గ్రాడ్యుయేట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన ఛాయ ఆ తరువాత డాటా-డ్రివన్, సోషల్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టింది. 'మెటా'లో 'డాటా ఫర్ ఇనిషియేటివ్' హెడ్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించింది. ఫేస్‌బుక్‌లో ఓపెన్ రీసెర్చ్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ(ఫోర్ట్) హెడ్‌గా పనిచేసింది. 'ఓపెన్ ఏఐ'లోకి రావడానికి ముందు ఫేస్‌బుక్‌లో జనరేటివ్ ఏఐ ప్రాజెక్ట్ మెనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది. 'మెటాలోని తొలి రోజులు నిన్నా మొన్నా జరిగినట్లే అనిపిస్తున్నాయి. మెటాలో పని చేసిన అనుభవం నా కెరీర్‌కు గట్టి పునాది వేసింది' అంటుంది ఛాయ. 'నా ప్రయాణం ఆగిపోలేదు. పుస్తకంలో ఒక పేజీని తిప్పాను. అంతే!' అని లింక్‌డ్ ఇన్ పోస్ట్‌లో కంపెనీ మార్పు గురించి రాసింది ఛాయానాయక్.

● డిజిటల్ అలర్ట్

అలా... ఆమె ప్రాణాలు కాపాడారు!



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలికి చెందిన అమ్మాయి ఒకరు 'నేను ఆత్మహత్య చేసుకోబోతున్నాను' అని అర్ధరాత్రి దాటిన తరువాత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. 'మెటా' వెంటనే ఈ పోస్ట్‌ను స్టేట్ పోలీస్ మీడియా సెంటర్‌కు పంపి పోలీసులను అలర్ట్ చేసింది. కేవలం పదహారు నిమిషాల వ్యవధిలో ఒక సబ్-ఇన్‌స్పెక్టర్, కొందరు మహిళా పోలీసులు ఆ అమ్మాయి ఉన్న ఇంటికి చేరుకున్నారు. వాంతులు చేసుకున్న ఆ అమ్మాయి నిస్తేజంగా పడి ఉంది. వెంటనే ఆమెను హస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

సమయానికి ఆస్పత్రికి తీసుకురావడం వల్ల ఆ అమ్మాయి చావు నుంచి బయటపడింది. ఆమె కోలుకున్న తరువాత... 'ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావు?' అని అడిగితే... తాను ప్రేమించిన వ్యక్తి మాట్లాడడం మానేశాడని, తన ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని...ఇలా చెప్పుకుంటూ పోయింది.

పెరుగుతున్న ఆన్‌లైన్ సుసైడ్ అటెంప్ట్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు, మెటా భాగస్వామ్యంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో సుసైడ్-రిలేటెడ్ పోస్ట్‌లపై నిఘా పెడుతున్నారు. వెంటనే రంగంలోకి దిగుతున్నారు. జనవరి 1, 2023 నుంచి ఆగస్ట్ 25, 2025 వరకు 1,315 మంది ప్రాణాలను కాపాడారు.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 3న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,06,810	99,890	1,27,000
విజయవాడ	1,08,950	98,050	1,26,300
విశాఖపట్నం	1,06,970	98,050	1,37,000
రాజమండ్రి	1,08,950	1,00,990	1,26,300
ప్రొద్దుటూరు	1,07,200	98,620	1,26,000
చెన్నై	1,06,960	98,050	1,37,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.